చివరిలో వాతావరణం

- రైతుల గుండెల్లో గుబులు
- కళ్లాల్లో ధాన్యపు రాశులు
- నిలువునా ముంచిన అకాల వర్షం
- కుప్పల చుట్టూ చేరిన నీరు



మామిడికుదురులో కుప్ప చుట్టూ చేరిన నీటిని తోడుకుంటున్న రైతు



పినపళ్లలో భారీ వర్షాలకు తడిసి ముద్దయిన పచ్చి ఇటుక

అలమూరు: మండు వేసవిలో కురిసిన అతి భారీ వర్షం , ఈదురు గాలుల వల్ల జనజీవనం స్తంభించింది. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రహదారులపైన, లేఅవుట్లలో ధాన్యపు రాశులు దర్శనమిస్తున్నాయి. వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల ఈదురు గాలులతో పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఒక మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే ధాన్యం వ్యాపారులు, మిల్లర్లు, దళారులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.250 వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్న తరుణంలో ఈ అకాల వర్షాలు రైతులను మరింత కుంగదీశాయి. ఈ వాతావరణం ఇదే విధంగా మరో రెండు రోజుల పాటు కొనసాగితే ఎంతకైనా ధాన్యాన్ని విక్రయించే పరిస్థితి రైతులకు ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు సరైన గోదాములు లేకపోవడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే ఏప్రిల్ రెండవ వారంలో కురిసిన వర్షాలు రైతులకు నష్టాలను మిగల్చగా ఆదివారం కురిసిన వర్షం రైతుల పాలిట అశనిపాతంలా మారింది. మండలంలోని కొన్ని చోట్ల ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు వెళ్లడంతో రైతులు తీవ్ర మానసిక వేదన పడుతున్నారు. భారీ వర్షాల ప్రకటనల నేపథ్యంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమ పడవలసి వచ్చింది.

ఉపాధి కోల్పోయిన కార్మికులు

అకాల వర్షాలకు మండలంలోని వివిధ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. అలాగే ఇటుక బట్టీల కళ్లాల మీద ఉన్న ఇటుక తడిసి ముద్దవ్వడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. లంక గ్రామాల రైతులు తాము పండించిన ఉత్పత్తులను అకాల వర్షం వల్ల ఎంతమేరకు నష్టం వాటిల్లి ఉండవచ్చునేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ అకాల వర్షాలు ఇటుక డిమాండ్ పెరిగిపోయి సామాన్యుల గూడు కట్టుకోవాలంటే అదనపు పన్నులు చెల్లించాల్సి ఉంది. ఈ అకాల వర్షాలకు తీవ్రంగా నష్టం వాటిల్లిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంటల ఒబ్బిడికి పాట్లు

అంబాజీపేట: ఆరుగాలం కష్టించి పండించిన పంటను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా అంబాజీపేట మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు నల్లటి మబ్బులు అలుముకుండటంతో చీకటి రాజ్యమేలింది. అనంతరం భారీ వర్షం కురిసింది. దాంతో రైతులు తమ వరి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఏ పూట ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని, ఆరబెట్టిన ధాన్యం పంటను గుట్టలుగా చేర్చి తడవకుండా బరకాలు కప్పుకున్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా మిల్లులకు తరలించేందుకు కొంత జాప్యం జరగడంతో పాటు సంచులు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా ప్రధాన రహదారిపై రాశులుగా పోసి సంరక్షించుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

మామిడికుదురు: నిబంధనల పేరుతో ప్రభుత్వం రైతుల నుంచి సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదివారం కురిసిన అకాల వర్షానికి పంటంతా తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పనలపై ఉన్న పంట తడిసిపోయిందని, కుప్పల చుట్టూ వర్షం నీరు చేరడంతో వరి పనలు తడిసిపోయాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాళం శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో చివరి సమయంలో తమకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో 2,850 ఎకరాల విస్తీర్ణంలో వరి పండించారు. దీనిలో 1700 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు 50 ఎకరాలకు పైగా పంట పనలపై ఉండిపోయింది. సుమారు 100 ఎకరాలకు సంబంధించిన కుప్పలు, ధాన్యం రాశులు ఎక్కడికక్కడ కళ్లాల్లోను, జాతీయ రహదారి బైపాస్‌పైన ఉండి పోయాయి. ఈ తరుణంలో కురిసిన భారీ వర్షం రైతులను దారుణంగా దెబ్బతీసింది. కుప్పల చుట్టూ చేరిన నీటిని బకెట్లతో తోడుకుని రైతులు కుప్పలు తడవ కుండా అష్టకష్టాలు పడ్డారు. ఎప్పుడూ ఇదే పరిస్థితి ఏర్పడుతోందని పంట చివరి దశలో ప్రకృతి తమపై పగబడుతోందని పంట చేతికందకుండా చేస్తోందని రైతులు తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

అయినవిల్లి: అకాల వర్షానికి మండలంలోని వరి పంట తడిచి ముద్దయింది. మొత్తం 7978 ఎకరాల్లో వరి పంట సాగవగా 4550 ఎకరాల్లో కోత పూర్తయింది. 9,337 టన్నులు ధాన్యం కళ్లాల్లో ఉంది. ఇందులో చాలా వరకూ వర్షానికి ముద్దయింది. 3428 ఎకరాల్లో వరి పంట కోయాల్సి ఉంది. అయితే ఈ పంట కూడా వర్షానికి నేలనంటింది. దీంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కళ్లాల్లో ధాన్యం బస్తాలు, రాశులు తడిచి పోవడంతో రైతులు వాటిని ఆరబెట్టి ఒబ్బిడి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజులు ఇలా వర్షం కురిస్తే ధాన్యం మొలకలు వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



గంగలకుర్రులో ప్రధాన రహదారిపై ధాన్యం రాశులను బరకాలతో కప్పిన రైతులు



మామిడికుదురులో కుప్ప తడవకుండా కప్పిన బరకాలు



మామిడికుదురులో తడిసిపోయిన పనలు



అయినవిల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చాలి

మలికిపురం: బట్టేలంకను ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చాలని సర్పంచ్ బోనం సీతారత్నం సూచించారు. ఆదివారం గ్రామపంచాయతీ వద్ద ప్రకృతి వ్యవసాయ గ్రామసభ సర్పంచ్ సీతారత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నవధాన్యాల సాగుపై చర్చ జరిగింది. రైతులను గ్రామ సంఘం ద్వారా ధ్రువీకరించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ బట్టేలంక గ్రామాన్ని పూర్తి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చాలని అందరూ రసాయన రహిత వ్యవసాయాన్ని చేయాలని తద్వారా వచ్చిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా ఆరోగ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానం తప్పక ఆచరించాలని దీనివల్ల భూమి సారవంతం పెరిగి దిగుబడి ఎక్కువ వస్తుందని ప్రజలు ఈ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని నవధాన్యాల సాగు వరికోతలకు ముందు తమ పొలాల్లో 31 రకాలు విత్తనాలు చల్లుకొని భూసారాన్ని పెంచుకోవాలన్నారు. రసాయనాలు, పురుగు మందుల వాడకం తగ్గించుకుని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు మట్ట శ్రీనివాసరావు, కిరణ్ మాట్లాడుతూ గ్రామ సభ ముఖ్యఉద్దేశం ఉపయోగాలు, ప్రణాళికలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాస్టర్ ట్రైనీ జోసఫ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ దేవత పెద్దింట్లమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అయిదు రోజుల పాటు జరిగే అమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక కుంకుమ పూజల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతులతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. అమ్మ వారిని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల్ని అమ్మవారు దయతో చల్లగా చూడాలని కోరుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కొరెడ్డి ఆంజనేయులు, పార్టీ నేతలు ఉన్నారు.



పెద్దింట్లమ్మను దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

కిడ్నీ బాధితునికి సాయం

మలికిపురం: అడవిపాలెం గ్రామం పద్మశాలీపేటలో రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బోసుకొండ పాండురంగారావుకు ఆదివారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.15 వేలు విలువైన మందులు అందించారు. అలాగే హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ (హైదరాబాద్) తక్షణ సాయంగా రూ.5 వేల నగదు, రూ.1500 విలువైన నిత్యావసరాలు అందించడమే కాకుండా, ఏడాది పాటు ప్రతి నెలా రూ.1500 విలువైన నిత్యావసరాలు అందిస్తామని హామీ ఇచ్చారని మానవతా గ్రూపు నిర్వాహకులు బోనం రాజు తెలిపారు. పాండురంగారావు స్వతహాగా చేనేత కార్మికుడైనప్పటికీ చేనేతకు సరైన ఆదరణ కొరవడటంతో తాపీ పనిచేసుకుని జీవిస్తున్నారు. అకస్మాత్తుగా అనారోగ్యం, వెనువెంటనే కిడ్నీలు పాడవటంతో గత ఆరు నెలలుగా వారానికి 3 సార్లు డయాలసిస్ చేయవలసిన పరిస్థితిలో ఆర్థిక ఇబ్బందులతో మానవతా మూర్తులు గ్రూపును ఆశ్రయించారు. వెంటనే పాలకొల్లు వాకర్స్ క్లబ్ దృష్టిలో పెట్టడంతో ఎంతో ఉదారంగా పంపిన మందులను, హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ అందించిన సాయాన్ని మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, జిల్లా రెడ్ క్రాస్ సభ్యురాలు జల్లి సుజాత, సర్పంచ్ కొల్లు నరసింహ స్వామి చేతుల మీదుగా అందజేశారు.

సర్పంచ్ భర్తను నిలదీసిన గ్రామస్తులు

అంబాజీపేట: మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా డ్రైనేజీని నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి భర్త సుబ్బారావును అంబాజీపేట కొర్లపాటివారిపాలెం ప్రజలు ఆదివారం నిలదీశారు. అనేకసార్లు డ్రైనేజీ నిర్మించాలని లిఖిత పూర్వకంగా తెలియజేసినా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొద్దిపాటి వర్షానికే నివాస ప్రాంతంలో చెరువులా మారిపోతుందని బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ భర్త సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో రహదారులు నిర్మిస్తున్నామని, ఈ నిధులతో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే అవకాశం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు త్వరలో పంచాయతీకి వస్తున్నాయని వాటి ద్వారా డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



కొర్లపాటివారిపాలెంలో సుబ్బారావును నిలదీస్తున్న ప్రజలు

రాజేష్ చౌదరికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరుకు చెందిన రెడ్డి రాజేష్ చౌదరికి ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ కీర్తి పురస్కారం లభించింది. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా పాన్ ఇండియా, ఫిలాం ట్రోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డుల పంపిణీ జరిగింది. ఎన్టీఆర్ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వారి సేవలకు గుర్తింపుగా ఇచ్చే ఈ అవార్డుకు రాజేష్ చౌదరిని నిర్వాహక కమిటీ ఎంపిక చేసింది. అందులో భాగంగా విజయవాడలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మాజీ స్పీకర్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆయన జ్ఞాపికను స్వీకరించారు.

రాజోలు: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌పై కవితా సంకలనం రూపొందించడం అభినందనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకల్లో కవితా సంకలనం సంపాదకుడు, కవి కత్తిమండ ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఏలేశ్వరానికి చెందిన బూడి శ్రీనివాసరావు ఆదివారం రూ.10,002 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు

రావులపాలెం: గ్రామ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వలస కూలీల చిన్నారులకు, భిక్షాటన చేసుకునే చిన్నారులకు శ్యామ్ జాదుగర్ మాయా ఈబడి ద్వారా గ్రామీణ ఆటల పోటీలను గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నట్టు శ్యామ్ తెలిపారు. గ్రామీణ ఆటలైన తొక్కుడు బిల్ల, తాడాట, బొంగరాలాట, గోలీలాట, ఉప్పల గుప్ప వంటి గ్రామీణ ఆటల్లో ప్రతిభ చూపిన సుమారు 30 మంది చిన్నారులకు ఆదివారం బహుమతులతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు వాటిని అందజేశారు.

ఆపదమొక్కులవాడా.. అనాథరక్షకా..

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం 'ఏడు వారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం ' నానుడితో నిత్య కల్యాణం పచ్చతోరణంలా వెలుగొందుతుంది. అశేష భక్తజనం తరలిరావడంతో ఈ క్షేత్రం కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా మిగిలిన రోజుల్లో కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఆదివారం స్వామివారి అష్టోత్తర పూజలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ క్షేత్రానికి శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా 7 ప్రదక్షిణలు చేయడం ఇబ్బందిగా ఉండటంతో ఏ వారమైనా ఫరవాలేదు వారానికి ఏదో ఒక రోజు 7 ప్రదక్షిణలు ప్రధానం అని అనేక మంది భక్తులు శనివారం మినహా మిగిలిన రోజుల్లో కూడా 7 ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. అనంతరం అష్టోత్తర పూజ జరిపించుకుంటున్నారు. అలా ఆదివారం అత్యధిక సంఖ్యలో భక్తులు 7 ప్రదక్షిణలు చేశారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ-ధర్మాదాయ శాఖ డీసీ, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆధిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు వసంత మండపంలో స్వామివారికి అష్టోత్తర నామార్చన, నిత్య కళ్యాణం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.



స్వామివారి అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

శ్రీధర్‌కు ఘన సన్మానం

కొత్తపేట: ఇటీవల జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీధర్‌కు ఆయన స్వగ్రామం ఆత్రేయపురం మండలం ర్యాలిలో ఆదివారం సాయంత్రం గ్రామ పెద్దలు, అభిమానులు సన్మానం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గతంలో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన శ్రీధర్‌కు పార్టీలో ఉన్నత పదవి రావడం అందరికీ ఆనందంగా ఉందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ఇప్పటి నుంచే అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీధర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కుంచే సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మెర్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఉండ్రు నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ర్యాలిలో శ్రీధర్‌ను సత్కరిస్తున్న సాయిబాబు, గ్రామ పెద్దలు

క్లుప్తంగా

వెంకన్న కల్యాణానికి రాట ముహూర్తం



ఆలయ ప్రాంగణంలో పసుపు దంచుతున్న మహిళలు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ రాత్రి వెంకటేశ్వరుని కల్యాణాన్ని ఘనంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగానే స్వామిని పెండ్లికుమారుని చేసి, సంప్రదాయ పద్ధతిలో మహిళలు పసుపు కొట్టారు. స్వామి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 8న స్వామి వారి తీర్థం జరుపుతామన్నారు. అదే రోజు మధ్యాహ్నం స్థానిక యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టనున్నామన్నారు.

కళాకారుడు సత్యనారాయణకు సన్మానం



రాజమహేంద్రవరంలో సన్మానం పొందిన కవులు

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్ర కథ కళాకారులు, కవి మంగం సత్యనారాయణను ఆదివారం ఘనంగా సత్కరించారు. అంబేద్కర్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఎల్ఐసీ ఉద్యోగుల భవనంలో అంబేద్కరీయం కవులు, గాయకుల సమ్మేళనంలో సత్యనారాయణ సన్మానం అందుకున్నారు. సత్యనారాయణ ఇటీవల పలు అవార్డులు అందుకున్నారు. వీటితో పాటు సన్మానాలు, సత్కారాలు పొందారు. సత్యనారాయణను సన్మానించారు. ఇతనితో పాటు మామిడికుదురుకు చెందిన గంటి చంద్రశేఖర్ కూడా సత్కారం పొందారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



సహచరుని కుటుంబానికి సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: అప్పనపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదువుకున్న కోట సత్యసాయిబాబు గత ఏడాది నవంబర్ నెలలో ప్రమాదవశాత్తూ బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందారు. అతడి కుటుంబానికి అతనితో కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆదివారం అతడి కుటుంబాన్ని పరామర్శించి రూ.65 వేల ఆర్థికసాయం అందించారు. దీంతో పాటు అయిదు వేల రూపాయల కిరాణా సరుకులను అందించారు. అతని కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి



విజేతలకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటులో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే బహుమతులు అందించారు. ఈ పోటీల్లో పెదపట్నంలంక టీమ్ విన్నర్‌గాను, అప్పనపల్లి టీమ్ రన్నర్‌గాను నిలిచాయి. వారికి రూ.10 వేల నగదు ప్రోత్సాహాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారికి సరైన ప్రోత్సాహం లేక మరుగున పడిపోతున్నారన్నారు. అటువంటి వారిని వెలికి తీసి వారికి ప్రోత్సాహం అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పేరూరు సతీష్, కాకి సాయి, జవ్వాది నాని, స్థానికులు పాల్గొన్నారు.

7న శివాలయం భూమి కౌలుకు వేలం

సఖినేటిపల్లి: ఈ నెల ఏడో తేదీన మోరి శివాలయానికి చెందిన 6.51 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ జాన సునీల్ ఆదివారం తెలిపారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో కౌలు హక్కు పొందవచ్చన్నారు. ఆలయం వద్ద రైతులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఎంపీ బోస్‌ను కలసిన జగ్గిరెడ్డి



రామచంద్రపురంలో ఎంపీ బోస్‌ను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోస్ ఇటీవల వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఆయనను జగ్గిరెడ్డి రామచంద్రపురంలో కలసి అభినందనలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. అలాగే జిల్లాకు పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన జగ్గిరెడ్డిని బోస్ అభినందించారు. పార్టీ బలోపేతం గురించి చర్చించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

దేశినీడి కుటుంబానికి పరామర్శ



రాము చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా తదితరులు

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో పుత్ర వియోగంతో ఉన్న సీనియర్ నాయకుడు దేశినీడి ఉదయ భాస్కరరావును రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పరామర్శించారు. దేశినీడి ఉదయ్ భాస్కర్ కుమారుడు రాము ఇటీవల మృతి చెందారు. రాము చిత్రపటానికి రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. రాజాతో పాటు వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు జక్కంపూడి తాతాజీ, తోరం గౌతమ్, జక్కంపూడి వాసు, కాండ్రేగుల బాబీ, తులా గోపాలకృష్ణ, బందారు కాశీ పరామర్శించిన వారిలో ఉన్నారు.

మీరాసాహెబ్ శెట్టికి సన్మానం

అంబాజీపేట: గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టిని సంఘ నాయకులు సత్కరించారు. గంగలకుర్రు అగ్రహారంలో శెట్టిబలిజ సంఘ నాయకుల సమావేశం, ఆదివారం జరిగింది. సంఘ అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు కృషిచేస్తానని శెట్టి అన్నారు. కార్యక్రమంలో విత్తనాల ఇంద్రశేఖర్, దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాస్, పితాని సత్తిబాబు, కట్టా వెంకట సుబ్రహ్మణ్యం, గుడాల ఫణి, కొప్పిశెట్టి రాంబాబు, రాయుడు మీరయ్య, రాయుడు చంటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆత్రేయపురంలో సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపేట: ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు వేగేశ్న సత్యనారాయణరాజు కుటుంబానికి ఆయన సహచర టీటీసీ బ్యాచ్ ఉపాధ్యాయ మిత్రబృందం ఆర్థిక సాయం అందజేశారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన సత్యనారాయణరాజు ఆ మండలంలోని ర్యాలి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ప్రకాశం జిల్లా మైనంపాడు 1992-93 టీటీసీ ఉపాధ్యాయులు, వారి గురువులు రాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారందరూ కలిసి సేకరించిన రూ.1,05,000 ను రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ మిత్రులు ఏఎస్‌డీ ప్రసాదరావు, పడగ సత్తిబాబు, ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఐఎస్‌వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.